# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 24-09-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సాంకేతికత సహాయంతో పౌరులకు అధిక సంఖ్యలో ప్రజా సేవలు అందించబడుతున్నాయని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పేర్కొన్నారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడు రోజుల అమెరికా పర్యటన ముగించుకుని ఈరోజు స్వదేశానికి చేరుకున్నారు.
- ❖ అంతర్గత విపత్తుల నుండి దేశాన్ని రక్షించడంలో కోస్ట్ గార్డ్ సహకారం అసమానమైనదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.
- ❖ శ్రీలంక నూతన ప్రధానమంత్రిగా హరిణి అమరసూర్య ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.
- ❖ జమ్మూ కాశ్మీర్‌లో రేపు 2వ విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది.

==========================

ప్రపంచంలో పెరుగుతున్న సాంకేతికత కారణంగా పౌరులకు మరింత ఎక్కువ ప్రజా సేవలు అందించబడుతున్నాయని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పేర్కొన్నారు. న్యూఢిల్లీలో "ఆసియా ఆర్గనైజేషన్ ఆఫ్ సుప్రీం ఆడిట్ ఇనిస్టిట్యూషన్స్" (ASOSAI) 16వ అసెంబ్లీని ఈ రోజు రాష్ట్రపతి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... ఆడిట్ పర్యవేక్షణ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలంటే సాంకేతిక పరిణామానికి అనుగుణంగా ఉండాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్, జియో-స్పేషియల్ టెక్నాలజీ వంటి అభివృద్ధి చెందుతున్న డిజిటల్ టెక్నాలజీలు ఆధునిక పాలనకు వెన్నెముకగా మారుతున్న తరుణంలో ప్రపంచం ఉందని తెలిపారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పౌరులకు అందించే సేవల పనితీరును మెరుగుపరచడానికి పునాదిగా పని చేస్తుందని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడు రోజుల అమెరికా పర్యటన ముగించుకుని ఈరోజు స్వదేశానికి తిరిగి చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా క్వాడ్ లీడర్స్ సదస్సులో పాల్గొన్నారు. ఆ తరువాత అమెరికా అధ్యక్షులు జో బైడెన్ తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అలాగే జపాన్ ప్రధానమంత్రి ఫుమియో కిషిడా, ఆస్ట్రేలియా ప్రధానమంత్రి యాంటోనీ ఆల్బోనీస్ తో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. పర్యటనలో రెండవ రోజున ప్రముఖ టెక్ సంస్థలకు చెందిన ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. నిన్న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో నరేంద్రమోదీ ప్రసంగిస్తూ... డిజిటల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ప్రపంచ దేశాల మధ్య వారధిగా మారాలిగాని అవరోధం కాకూడదన్నారు. ఈ పర్యటనను విజయవంతంగా ముగించుకుని ఈరోజు ఉదయం భారత్ కు చేరుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్గత విపత్తుల నుండి దేశాన్ని రక్షించడంలో కోస్ట్ గార్డ్ సహకారం అసమానమైనదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో ఇండియన్ కోస్ట్ గార్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్ 41వ ఎడిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారత తీర రక్షణ దళాన్ని భారతదేశపు అగ్రగామి గార్డుగా అభివర్ణించారు. ఉగ్రవాదం, ఆయుధాలు, మాదక ద్రవ్యాలు, మనుషుల అక్రమ రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకుంటామని తెలిపారు. ఆత్మనిర్భర్తను పొందిందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా, భారత తీర రక్షక దళం కోసం 31 నౌకలను భారత నౌకాశ్రయాల ద్వారా నిర్మిస్తున్నామని రాజ్‌నాథ్ సింగ్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

హరిణి అమరసూర్య శ్రీలంక నూతన ప్రధానమంత్రిగా ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీలంక నేషనల్ పీపుల్స్ పవర్ పార్టీ చెందిన హరిణి అమరసూర్యతో పాటు పార్లమెంటేరియన్లు విజిత్ హెరాత్, లక్ష్మణ్ నిపున్ అరాచ్చి క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవల ఎన్నికల్లో గెలిచిన అధ్యక్షులు అనురా కుమార దిస్సనాయకే సమక్షంలో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్‌లో రేపు 2వ విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. 6 జిల్లాల్లోని మొత్తం 26 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈ రెండవ దశలో ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ జరుగుతుంది. ఈ దశలో కీలక అభ్యర్థులైన మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, పీసీసీ యూటీ చీఫ్ తారిఖ్ హమీద్ ఖర్రా, అప్నీ పార్టీ అధ్యక్షుడు అల్తాఫ్ బుఖారీ ఉన్నారు. మిగిలిన 40 అసెంబ్లీ నియోజకవర్గాలలో 3వ దశ ఎన్నికలు అక్టోబర్ 1వ తేదీన జరగనున్నాయి. అక్టోబర్ 8న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐక్యరాజ్య సమితి సాధారణ సభ సమావేశాల సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్.జయ శంకర్ బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ విదేశాంగ సలహాదారు తౌహిద్ హుస్సేన్ తో నిన్న న్యూయార్క్‌లో ద్వైపాక్షిక సమాశం నిర్వహించారు. కాగా, ఇటీవల బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా రాజీనామా తరువాత మహ్మద్ యూనిస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వంతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారి.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక అని కేంద్ర వ్యవసాయం, రైతుల సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఈ రోజు ఢిల్లీలో రైతు సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. సుమారు 50 మంది రైతు సంఘాల నాయకులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘాలు పంటల కనీస మద్దతు ధర, పంట  బీమాలపై కేంద్రమంత్రికి పలు సూచనలు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

లోక్ సభ సభాపతి ఓం బిర్లా 10వ  కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ ఇండియా రీజియన్ కాన్ఫరెన్స్‌కు ఈరోజు అధ్యక్షత వహించారు. న్యూ ఢిల్లీలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 25 మంది స్పీకర్లు, నలుగురు ఛైర్మన్లు, 22 మంది ప్రిసైడింగ్ అధికారులు ఈ సదస్సుకు హాజరయ్యారు. సదస్సు ముగిసిన అనంతరం ఓం బిర్లా పాత్రికేయులతో మాట్లాడుతూ... సమావేశంలో పాల్గొన్న శాసనసభ్యులు ప్రజలతో కలిసి పని చేయాలని సూచించారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలని రాష్ట్ర అసెంబ్లీలలో అవలంబించిన వినూత్న ఆలోచనలు అందరితో  పంచుకున్నామని తెలిపారు. ఒకే దేశం.. ఒకే డిజిటల్ ప్లాట్‌ఫారమ్ లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా రాష్ట్ర అసెంబ్లీల డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ఆయన పేర్కొంటూ....

(వాయిస్ 23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ముడా కుంభకోణం కేసులో తనను విచారించేందుకు గవర్నర్ అనుమతించడాన్ని సవాల్ చేస్తూ కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దాఖలు చేసిన పిటిషన్‌ను ఆ రాష్ట్ర హైకోర్టు తిరస్కరించింది. గవర్నర్ కు స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే హక్కు ఉందని, ఈ సందర్భంగా హై కోర్టు స్పష్టం చేసింది. కాగా ఆగస్టు 16వ తేదీన, అవినీతి నిరోధక చట్టం, భారతీయ న్యాయ సంహిత కింద ముఖ్యమంత్రిపై చర్యలకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఆమోదించగా.. ఆ ఉత్తర్వులను ఆగస్టు 19న సిద్ధరామయ్య హైకోర్టులో సవాలు చేస్తూ పిటీషన్ వేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సెన్సెక్స్ ఈరోజు తొలిసారి 85 వేల మార్కును దాటగా.. నిఫ్టీ సైతం 26 వేల స్థాయిని దాటింది. గరిష్ఠాల వద్ద అమ్మకాల ఒత్తిడితో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సాధారణంగా ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 84,860.73 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమై, చివరికి 14.57 పాయింట్ల నష్టంతో 84,914.04 వద్ద ముగిసింది. నిఫ్టీ ఇంట్రాడేలో 26,011.55 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి కేవలం ఒక్క పాయింట్ లాభంతో 25,940.40 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.66గా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఝార్ఖండ్‌లో మరి కొద్ది రోజుల్లో ఎన్నికల జరగనున్న నేపథ్యంలో  కేంద్ర ఎన్నికల సంఘం ఉన్నత స్థాయి అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు - జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధుతో కలిసి అన్ని డివిజన్ల కమిషనర్‌లు, జోనల్ ఐజిలు,  జిల్లా ఎన్నికల అధికారులు, డిఐజిలు ఈసమీక్షలో పాల్గొన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలను సజావుగా, శాంతియుతంగా

నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని, రాష్ట్ర పోలీసు నోడల్ అధికారిని, కేంద్ర సాయుధ పోలీసు బలగాల నోడల్ అధికారులను కూడా ఎన్నికల సంఘం ఆదేశించింది.

============================

త్రిపురలో నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (NLFT), ఆల్ త్రిపుర టైగర్ ఫోర్స్ (ATTF)కి చెందిన 500 మంది తీవ్రవాదులు ఆయుధాలతో ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. హింస మార్గాన్ని విడనాడి జనజీవన స్రవంతిలోకి తిరిగి చేరడానికి త్రిపుర ముఖ్యమంత్రి సమక్షంలో సెపాహిజాలా జిల్లా పరిధిలోని జంపూయిజాలాలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి డాక్టర్ మాణిక్ సాహా మాట్లాడుతూ.. తీవ్రవాద గ్రూపుల సభ్యులు ప్రధాన స్రవంతిలో చేరడం వల్ల ఎటువంటి అవరోధాలు లేకుండా రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో ఈశాన్య రాష్ట్రాలకు చెందిన పలు సంస్థలతో మొత్తం 12 ఒప్పందాలు జరిగాయని, అందులో 3 ఒప్పందాలు ఒక్క త్రిపురతోనే కుదిరాయని ఆయన తెలిపారు.

============================

============================